క్లుప్తంగా

అధికారుల బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓ వెంకటేశ్వర్రావు

తోటపల్లిగూడూరు : నూతన ఎంపీడీఓగా వెంకటేశ్వరరావు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గూడూరు ఎంపీడీఓగా పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సర్వేయర్‌గా మహబూబ్‌బాషా


సర్వేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేత

తోటపల్లిగూడూరు : మండల సర్వేయర్‌గా మహబూబ్‌బాషా శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ముత్తుకూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ముత్తుకూరు ఎంపీడీఓగా నాగమణి


ఎంపీడీఓకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

ముత్తుకూరు : ముత్తుకూరు ఎంపీడీఓగా నాగమణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మర్రిపాడు మండలం నుంచి ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

మనుబోలు ఎంపీడీఓగా జలజాక్షి


జలజాక్షి

మనుబోలు : మండల నూతన ఎంపీడీఓగా జలజాక్షి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆమె ఇందుకూరుపేట, నెల్లూరు రూరల్ మండలాల్లో ఈఓపీఆర్డీగా పనిచేసి పదోన్నతిపై ఎంపీడీఓగా ప్రకాశం జిల్లాలో పనిచేశారు.

ఏఎస్సైగా జిలానిబాషా


జిలానిబాషా

మనుబోలు : మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా జిలానిబాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వెంకటాచలం మండలంలోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై మనుబోలుకు బదిలీ అయ్యారు.

కొడవలూరు ఎంపీడీఓగా సుబ్బారావు



సుబ్బారావుతో సిబ్బంది

కొడవలూరు : కొడవలూరు ఎంపీడీఓగా ఏవీ సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బోగోలు ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

విశ్రాంత టీచర్ మృతికి సంతాపం

మనుబోలు : విశ్రాంత ఉపాధ్యాయుడు, డ్రాయింగ్ మాస్టర్ మధుసూదన్‌రావు అనారోగ్యంతో శుక్రవారం మనుబోలులో మృతిచెందారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నేతలు చల్లా నవకోటి, దాసరి భాస్కర్‌గౌడ్, చలగల దయాకర్, కోసూరు కోటేశ్వరగౌడ్ తదితరులు ఉన్నారు.


మనుబోలు తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సర్వీస్ రోడ్డుపై పోగుపడిన చెత్త


మనుబోలు సచివాలయం వెనుక ముళ్ల చెట్లలో పడేసిన రిక్షాలు

చెత్తే ఉంది.. సంపదే లేదు

- మొక్కుబడిగా సంపద తయారీ కేంద్రాలు
- పత్తాలేని గ్రీన్ అంబాసిడర్లు
- ఎక్కడి చెత్త అక్కడే

మనుబోలు : పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా గతంలో మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మండలంలో 19 పంచాయతీలు ఉండగా, 15 పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలను(డంపింగ్ యార్డ్స్) ఏర్పాటు చేశారు. అయితే కాల క్రమంలో వాటిని ఉపయోగించడం మానేయడంతో అవి మొక్కుబడిగా మారాయి. మండల పరిధిలో రెండు మూడు గ్రామాల్లో తప్ప మిగిలిన పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో పోగుపడే చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరించాక దానిని తడి చెత్త, పొడి చెత్తగా విభజించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు. అక్కడ చెత్తలో వాన పాములను వదిలి కుళ్లబెట్టడం ద్వారా దాని నుంచి కంపోస్టు ఎరువును తయారు చేస్తారు. ఆ ఎరువును రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవడమే కాకుండా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగవుతుంది. ఇదీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ముఖ్య ఉద్దేశం.

చెత్త నిర్వహణ

చెత్తను సేకరించేందుకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇళ్లలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా నిల్వ చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో కొన్ని గ్రామాల్లో ఇంటికి రెండేసి ప్లాస్టిక్ బకెట్లను కూడా పంపిణీ చేశారు. అన్ని పంచాయతీలకు చెత్తను తరలించేందుకు రిక్షాలను కూడా పంపిణీ చేశారు. ప్రస్తుతం అవి మూలన పడి ఉన్నాయి. మనుబోలులో అయితే సచివాలయం వెనుక వైపు ఐదారు రిక్షాలను ముళ్ల చెట్లలో పడేసి ఉన్నారు. ప్రస్తుతం వాటిని గాలికొదిలేయడంతో చెత్త నుంచి సంపద తయారీ సంగతి పక్కన పెడితే గ్రామాల్లో పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా మారింది. గ్రామాల్లో పోగుపడే చెత్తను సైతం సిబ్బంది సక్రమంగా తొలగించడం లేదు. ప్రస్తుతం మండలంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో రెండు మూడు తప్ప అన్నీ నిరుపయోగంగానే ఉన్నాయి. గ్రీన్ అంబాసిడర్ల జాడే లేదు. వీటిని పునరుద్ధరించి గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది.


చెర్లోపల్లిలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డ్

పునరుద్ధరిస్తాం



కొన్ని గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలు బాగానే పనిచేస్తుండగా చాలా గ్రామాల్లో సమస్యలు ఉన్న విషయం వాస్తవమే. గతంలోనే ప్లాస్టిక్ బకెట్లు పంపిణీ చేయడంతో పాటు కొన్ని గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను కూడా నియమించాం. మధ్యలో ఎన్నికల కోడ్ వల్ల కొంత ఇబ్బంది జరిగింది. ఇటీవలే మళ్లీ ప్లాస్టిక్ బకెట్లను కూడా పంపిణీ చేసి ఉన్నాం. ఉన్న సంపద కేంద్రాలను త్వరలోనే పునరుద్ధరిస్తాం.

– ప్రసాద్, పంచాయతీ విస్తరణాధికారి

చెత్త కుండీలైనా ఏర్పాటు చేయాలి



తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలని అధికారులు చెప్పారు. రెండేళ్ల క్రితం ఇంటికి రెండేసి వంతున ప్లాస్టిక్ బకెట్లను కూడా అందజేశారు. అయితే ఇటీవల కాలంలో అసలు రోడ్లపై ఉన్న చెత్తను కూడా సక్రమంగా తీయడం లేదు. మా కాలనీ పక్కనే సర్వీస్ రోడ్డులో చెత్త పోగుపడి వర్షం వస్తే దుర్గంధం వస్తోంది. కనీసం చెత్త కుండీలైనా ఏర్పాటు చేయాలి.

– కంటేపల్లి మీరమ్మ, అరుంధతీవాడ, మనుబోలు

పంచాయతీల్లో నిధుల కొరత



గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇచ్చేందుకు నిధుల కొరత ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జీతాలు ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఆ నిధులు సాధారణ ఖర్చులకే సరిపోయే పరిస్థితి లేదు. దీంతో గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేయలేకపోయాం. త్వరలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం.

– చేడిమాల శ్రీలత, సర్పంచ్, చెర్లోపల్లి

కాకాణి పరామర్శ


దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి

ముత్తుకూరు : ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ముత్తుకూరు మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, హార్టీ కల్చర్ బోర్డు సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కాకాణి దువ్వూరువారిపాళెం వెళ్లి చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శించారు. దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి. పోచారెడ్డి చెంగారెడ్డి, సర్పంచ్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముత్తుకూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇటీవల బూత్ కన్వీనర్‌గా ఉంటూ కొమారి శివ అనే వ్యక్తి చనిపోగా ఆయన కుటుంబ సభ్యులను కాకాణి పరామర్శించారు. ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ నవీద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. తిక్కవరప్పాడుకు చెందిన దేవనబోయిన చిన్నయ్య కాలినడకన ఇంటికి వెళ్తుండగా సర్వేపల్లి వైపు వెళ్తున్న బైక్ చిన్నయ్యను ఢీకొట్టింది. వెంటనే ఆయన్ను స్థానికులు చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

సన్మానం



పొదలకూరు : పొదలకూరు మేజర్ పంచాయతీ సెక్రటరీ డి.దుర్గాదొరబాబు ఇందుకూరుపేట మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యులు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీని సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

వైభవంగా జెండా ఉత్సవం



మనుబోలు : మనుబోలు కోదండరామపురంలోని దసరా చావిడిలో అర్చకుడు సాయికుమార్ శర్మ హనుమంతుని జెండా ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి హనుమంతునికి మంగళ హారతులు పట్టారు.

దుస్తుల పంపిణీ



పొదలకూరు : పొదలకూరు పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు పాలకమండలి ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతిఏడాది కార్మికులకు దుస్తులను అందజేస్తున్నట్లు తెలిపారు. వార్డు సభ్యులు అంజాద్, ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర ప్రొఫెసర్‌కు పురస్కారం


డాక్టర్ మాధవీలతను అభినందిస్తున్న చైర్మన్ గుణశేఖర్

కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ డాక్టర్ సి.మాధవీలతకు వెయిల్ ఫౌండేషన్ వారి నుంచి ప్రతిష్ఠాత్మక రవీంద్రరత్న పురస్కారం లభించింది. పరిశోధనా రంగాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఆమెకు పురస్కారం వరించింది. ఈ సందర్భంగా ఆమెను శుక్రవారం కళాశాలలో పలువురు అధ్యాపకులు అభినందనలు తెలిపారు. చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.


పొదలకూరు : రాజరాజేశ్వరి, అన్నపూర్ణ అలంకారం


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: త్రిపురాంబిక అలంకారం


పొదలకూరు : ధనలక్ష్మి అలంకారం

జగజ్జననీ.. పాహిమాం

పొదలకూరు : పట్టణంలో కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు రాజరాజేశ్వరి, అన్నపూర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామార్చన, త్రిశతి, సాయంత్రం ఖడ్గమాల పూజలు నిర్వహించారు. తరుగు గురవయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, తరుగు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు నాగరాజు, ప్రభాకర్, లక్ష్మీనారాయణ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

- పట్టణంలో కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం జరిపించారు.
- పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలుగా పైడా కామేశ్వరరావు- శ్రావణి, చొప్పా వెంకటేశ్వర్లు-మంజుల దంపతులు వ్యవహరించారు.
- ఇనుకుర్తిలోని కాంతమ్మతల్లి ఆశ్రమంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆశ్రమ పీఠాధిపతి సుబ్బారెడ్డిస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- **విడవలూరు:** విడవలూరు గ్రామదేవత అంకమ్మ తల్లి శుక్రవారం శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకుడు కొర్నా గిరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సత్యవోలు సత్యంరెడ్డి, నిర్మల ఉభయకర్తలుగా వ్యవహరించారు.


మనుబోలు: బాలా త్రిపురసుందరి అలంకారం

- **మనుబోలు :** మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం బాలా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా యారాసి రవికుమార్, శివలక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- కోవూరు రైల్వేరోడ్డు ప్రాంతంలో కొలువైన కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు భవని అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకుడు నందకిశోర్‌స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులతో లలితా సహస్ర పారాయణం చేపట్టారు. ఉభయకర్తలుగా పి.జ్వాల రామయ్య- శ్యామలమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- కోవూరు ప్రధాన రహదారిలో కొలువైన గ్రామదేవత నాగవరపమ్మ దేవస్థానంలో అమ్మవారు బాలా త్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు. అర్చకుడు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూలంగి సేవ చేపట్టారు. ఉభయకర్తలుగా వడ్డిపాళెం గ్రామస్తులు వ్యవహరించారు.


పొదలకూరు : శివాలయంలో..

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం త్రిపురాంబిక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- **కోవూరు :** స్థానిక పాటూరు రోడ్డులో కొలువైన రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ, అభిషేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా నీరజమ్మ, ఫణికుమార్‌రెడ్డి, స్వర్ణలత వ్యవహరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఆలూరు శ్రీనివాసులు, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


కోవూరు : భవాని అలంకారం


కోవూరు : బాలా త్రిపురసుందరి అలంకారం


విడవలూరు: శాకంబరి అలంకారం


కోవూరు : లక్ష్మీదేవి అలంకారం

ఇసుక లేకపోవడంతో పస్తులతో కార్మికులు

- వెంటనే ఉచిత ఇసుక ఇవ్వాలని సీపీఎం ధర్నా

బుచ్చిరెడ్డిపాళెం : ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పస్తులతో గడుపుతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాడి గోపాల్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉచిత ఇసుక కోసం సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఉచిత ఇసుక హామీని నేటికీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉచిత ఇసుకను అందించాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు ముత్యాల గురునాథం మాట్లాడుతూ సామాన్యుడికి ఇసుక దొరకడం లేదని, తెలుగుదేశం నాయకులకు మాత్రం బ్లాక్ మార్కెట్లో ఇష్టానుసారంగా అమ్ముతున్నారన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జున, నాయకులు పాతంశెట్టి శ్రీనివాసులు, మునిస్వామి, గరికపాటి సురేష్, షేక్ జానీబాషా, జానకిరామయ్య, మునీర్ అహ్మద్, కోటయ్య, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

ఇసుక సరఫరాను ప్రారంభించాలి

వెంకటాచలం: రాష్ట్ర ప్రభుత్వం ఇసుక సరఫరాను వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి ఓడూరు వెంకటకృష్ణయ్య డిమాండ్ చేశారు. వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక పంపిణీ అంటూ ప్రచారం చేసిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక సామాన్యులకు ఇసుక దొరకకుండా చేశారని మండిపడ్డారు. ఇసుక డిమాండ్‌తో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు షేక్.నజీర్, పొట్టేపాళెం సుధాకర్, సుబ్బరాయుడు, తుమ్మతాటి వెంకయ్య, పట్టపు కృష్ణ, షేక్.మస్తాన్ పాల్గొన్నారు.


బుచ్చిరెడ్డిపాళెంలో ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

కూటమి పాలన పూర్తి వైఫల్యం

తోటపల్లిగూడూరు : వంద రోజుల కూటమి పాలన పూర్తిగా విఫలమైనట్లు సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య విమర్శించారు. భవన నిర్మాణ కార్మిక సంఘానికి మద్దతుగా సీపీఎం మండల కమిటీ వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ రంగం కుంటుపడి దానిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలన్నారు.

శ్మశానానికి దారి చూపండి

పేడూరులోని అరుంధతీయ కాలనీ వాసులు శ్మశానానికి వెళ్లేందుకు దారి చూపి ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా విజ్ఞప్తి చేశారు. సీపీఎం నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్మశానానికి దారి లేక కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం డీటీ శివయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు.

- **కోవూరు :** స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సీపీఎం నేతలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నేత గండవరపు శేషయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఉచితంగా ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, పెద్దన్న, హరి, అఫ్రోజ్, రమేష్, సర్దార్ అహ్మద్, మోహన్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


వెంకటాచలం: తహసీల్దార్ కార్యాలయం వద్ద..

- **కొడవలూరు:** ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇసుకను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక కొరత వల్ల భవన నిర్మాణదారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఇసుకను ఉచితంగా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టి.నరసింహం, దేవానంద్, బి.కాంతారావు, టి.శీనయ్య పాల్గొన్నారు.
- **ముత్తుకూరు :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కార్యదర్శి గడ్డం అంకయ్య, షేక్ మస్తాన్, షేక్ సలామ్, వెంకటేశ్వర్లు తదితరులు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇసుకను అందుబాటులోకి తెచ్చి, భవన నిర్మాణ కార్మికులకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.


తోటపల్లిగూడూరులో..


కోవూరు మండల కేంద్రంలో..


కొడవలూరులో..